# ఆసరా

"ఏవండోయ్ ! ఓమారు ఇలా వస్తారా" భార్య సావిత్రమ్మ పిలుపు విని పెరట్లోకి వెళ్ళేడు సోమనాథం.

"అటు చూడండి!!" అంటూ మునగచెట్టువేపు చూపించింది.

"చూసేరా! ఆ గౌరీనాథం మన మునగ చెట్టు కొమ్మవాళ్ళ ప్రక్క వచ్చిందని కొట్టివేసేడా? మళ్ళీ ఆ మొండి కొమ్మే చక్కగా రెమ్మలు తొడిగి పూత పట్టింది" అంది ఆశ్చర్యంగా.

భార్య చెప్పింది నిజమే! రెండు నెలల క్రితం గౌరీనాథం ఎంతో ఉక్రోషంతో కొట్టివేసిన కొమ్ము చిగిర్చి పూత పట్టింది! అనుకున్నాడు.

అసలు జరిగిందేమిటంటే సోమనాథంగారి పెరట్లో పెద్ద మునగ చెట్టువుంది. ఆ చెట్టు నిండా పొడుగాటి కాయలు, పువ్వులతో ఎప్పుడూ నవనవలాడుతూ చూడముచ్చటగా, కన్నుల పండువుగా వుంటుంది. ఆ చెట్టు కొమ్మొకటి గౌరీనాథంగారి పెరట్లోకి వుంది. కొమ్మనిండా గుత్తులుగుత్తులుగా కాయలు వ్రేలాడుతున్నాయి.

ఒకరోజు సోమనాథం ఏదో పని మీద పెరట్లోకి వెళ్ళాడు. అదే సమయంలో గౌరీనాథం తమ ప్రక్కనున్న కొమ్మనుండి చకచకా మునగకాయలు కోస్తూండడంచూసేడు. దాంతో సోమనాథానికి ఎక్కడ లేనికోపం వచ్చింది.

"దొంగతనంగా కాయలు కోయడానికి సిగ్గులేదూ? అడిగి కోసుకోవాలనే జ్ఞానం వుండొద్దూ? మనిషికి ఏళ్ళురాగానే సరికాదు బుద్ధి వుండాలి" అంటూ దులిపేసేడు.

"ఏంటోయ్! దొంగతనమని నీ నోటికొచ్చినట్లూ వాగుతున్నావ్! మాటలు జాగ్రత్తగా రానీయ్, నేనేం దొంగతనంగా కొయ్యటంలేదు. పబ్లిగ్గానే కోస్తున్నాను. మా పెరట్లోకి వచ్చిన కొమ్మ. నా ఇష్టం కోస్తాను అడిగేందుకు నువ్వెవడివి?" అన్నాడు గౌరీనాథం పెడసరంగా.

"నేనెవడినా? చెట్టు ఓనర్ని. దొంగతనం చెయ్యడమేగాక పైగా దానిని సమర్థిస్తున్నావు

కూడా. ఈ మారు చెట్టుమీద చెయ్యివేస్తేచేతులు విరగగొడతాను జాగ్రత్త!" అన్నాడు సోమనాథం కోపంగా.

వీరిద్దరి పోట్లాట విని సోమనాథం భార్య సావిత్రమ్మ, గౌరీనాథం భార్య పార్వతమ్మ పెరట్లోకి వచ్చేరు.

"ముష్టి మునగకాయల కోసం వాళ్లతో తగువేమిటండీ?" అంటూ భర్త చేతిలో వున్న నాలుగు మునగకాడలు తీసుకొని కసి తీర వాటిని విరిచి సోమనాథం గారి పెరట్లోకి విసిరేసింది పార్వతమ్మ.

'చూసేరా ఆవిడగారి మిడిసిపాటు! కోసిన కాయలు ఎందుకూ పనికిరాకుండా ఎలా వాటిని విరిచి విసిరివేసిందో" అంది సావిత్రమ్మ.

"తేరగా వస్తే వాటి విలువేం తెలుస్తుంది. బజారుకెళ్ళి కొంటే తెలుస్తుంది. ఎన్నాళ్ళ నుండీ సాగుతుందో ఈ దొంగతనం? నేటికి మన కళ్ళబడింది" అన్నాడు సోమనాథం.

"వాళ్ళు అంతలేసి మాటలు అంటూ వుంటే అలా బొమ్మలా నిలబడతారెందుకండీ! చెట్టు వాళ్ళదిట! కాయలు వాళ్ళవిట! మన పెరటి నిండా ఎండిరాలిన ఆకులు, చెత్తమనది. రోజూ చెత్త వూడవలేక నా చేతులు నొప్పులు పుడుతున్నాయి. కత్తి తెచ్చి ఆ కొమ్మ కొట్టి పారవేయండి. దాంతో పీడ విరగడవుతుంది" అని భర్తను రెచ్చగొట్టింది పార్వతమ్మ.

గౌరీనాథం భార్య సలహాను వెంటనే అమలు పరిచేడు. తమ పెరట్లోకి వున్న కొమ్మను మందడి గోడ అంచువరకూ కత్తితోకొట్టి ఆ కొమ్మను సోమనాథం పెరట్లోకి విసిరివేసాడు.

గౌరీనాథం చర్యకు సోమనాథం మరింత రెచ్చిపోయి చిందులు త్రొక్కేడు. పెరట్లో మునగచెట్టు తగువు రెండు కుటుంబాల మధ్య పెద్ద అగాధం సృష్టించింది.

సోమనాథం, గౌరీనాథం బాల్య స్నేహితులు. ఇద్దరూ ఒకే ఈడువారు. ఇద్దరివీ ఇరుగుపొరుగిళ్లు, కలసి చదువుకున్నారు. స్కూలు ఫైనల్ పాసై పై చదువులకు ఆర్థిక స్తోమత లేక ఉద్యోగ వేటలో పడ్డారు. సోమనాథం టీచరుద్యోగం సంపాదించేడు ఎన్నో అవస్థలు పడి టీచరు ట్రైనింగయిన తరువాత. గౌరీనాథం తాలూకా ఆఫీసులో గుమస్తా. ఉద్యోగరీత్యా చెరొక ఊళ్లో ఉంటున్నా ఉత్తరాల ద్వారా ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకునేవారు.

సోమనాథం అమాయకుడు. ఎంతో నెమ్మదస్తుడు. అతనికి ముగ్గురు కుమార్తెలు. పెద్దమ్మాయి కమల పదవతరగతి పాసై పై చదువులు సంగతి ఆలోచించక తల్లికి సాయంగా వంటపని, ఇంటిపని చేస్తోంది. రెండో అమ్మాయి శారద. ఇంటరు చదువుతోంది. మూడో అమ్మాయి ఉమ ఫోర్తు ఫారం చదువుతోంది.

గౌరీనాథం లౌక్యుడు. లోకం పోకడలు చక్కగా ఆకళింపు చేసుకున్న వ్యక్తి. అతనికి ఒక్కడే కొడుకు. పేరు వినోద్. బి.ఎ. ఫస్ట్‌క్లాసులో పాసయ్యాడు.

సోమనాథం సర్వీసులో వుండగానే పెద్ద కూతురు కమలకు పెళ్ళిచేసేడు. స్నేహితులిద్దరూ ఆ పెళ్ళిలో కల్సుకున్నారు. గౌరీనాథం తన భార్యను, కొడుకుని తీసుకొచ్చాడు.

శారద చురుకుదనం, అందం, చదువు-గౌరీనాథం, పార్వతమ్మల్ని ఎంతో ఆకర్షించింది. వినోద్, శారదల మనసులు కలిసేయి.

"శారదను మా కోడలుగా చేసుకుంటానురా!" అంటూ నలుగురి ముందూ చెప్పాడు గౌరీనాథం. స్నేహితుడి వాగ్దానానికి ఎంతో ఆనందించాడు సోమనాథం.

కమల పెళ్ళై సంవత్సరం తిరక్కుండానే స్నేహితులిద్దరూ రిటైరై స్వస్థలం సొంత ఇళ్ళకు చేరుకున్నారు. వినోద్ సొంత వూర్లోనే ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు. నెలకు పన్నెండు వందలు చేతికందుతోంది. గౌరీనాథానికి పెన్షన్ పదిహేను వందలు వస్తోంది.

సోమనాథం పెద్ద కూతరు కమల పెళ్ళి చేసి ఆర్థికంగా బాగా దెబ్బతిన్నాడు. ప్రావిడెంట్ ఫండ్ పెళ్ళికి ఖర్చవగా ఇంకా కొన్ని చిల్లర బాకీలు తీర్చడానికి పెన్షన్‌లో కొంత భాగం సరిపోయింది. అందువల్ల అతనికి నెలకు పెన్షన్ తొమ్మిది వందలే వస్తోంది. ట్యూషన్లు చెప్పి మరో మూడు వందలు సంపాదిస్తూ దానితోనే గుట్టుగా సంసారం నెట్టుకొస్తున్నాడు.

వినోద్, శారదల ప్రేమ రోజురోజుకు వృద్ధి పొందుతోంది.

"అమ్మాయికి త్వరగా పెళ్ళి చెయ్యండి వరుడు రడీగా ఉన్నాడు కదా! ఇంకెందుకాలస్యం' 'అంటూ బంధువులు ఇటు స్నేహితులూ సోమనాథాన్ని అడుగుతున్నారు.

గౌరీనాథం భార్య సంగతి సరేసరి "శారద పరీక్షలు ఈ వారంలో అయిపోతాయి. వచ్చే నెలలో మంచి ముహూర్తాలున్నాయిట! అన్నయ్యగారితో వెంటనే ముహూర్తం పెట్టించండి' 'అంటూ భర్తను పదేపదే అడుగుతోంది. ఒకటి రెండు పర్యాయాలు సోమనాథాన్నే సూటిగా అడిగింది.

సోమనాథం ఆర్థిక పరిస్థితి గౌరీనాథానికి తెలును కనుక పెళ్ళికి తొందరచెయ్యలేకపోతున్నాడు.

అలాగని సోమనాథం వూరుకోలేదు. అప్పుకోసం ఎన్నో చోట్ల ప్రయత్నించేడు. బంధువులందర్నీ అడిగేడు. కాని లాభం లేకపోయింది. ఎక్కడా అప్పుపుట్టలేదు. చివరకు ఇల్లు అమ్మికూతురు పెళ్ళి చెయ్యసంకల్పించి ఇల్లు బేరం పెట్టి విషయం గౌరీనాథం చెవిని వేసేడు. స్నేహితుడు తీసుకొన్న నిర్ణయానికి ఏం చెప్పాలో అర్థం కాలేదు గౌరీనాథానికి. ఆ

పరిస్థితుల్లో అనుకోకుండా రెండు కుటుంబాల మధ్య ఈ మునగ చెట్టు తగువు వచ్చింది. దాంతో స్నేహితుల మధ్య స్నేహ సంబంధాలు తెగిపోయేయి. రెండు కుటుంబాల మధ్య మాటలు, రాకపోకలు ఆగిపోయేయి.

ఈ చిలిపి తగువుకు ఎక్కువగా బాధపడ్డది శారద, వినోద్‌లు. వినోద్ ఎన్నో విధాలుగా ఇటు తండ్రికి అటు సోమనాథానికి నచ్చచెప్పి ఇద్దరి మధ్యా రాజీకుదర్చడానికి ప్రయత్నించి విఫలుడయ్యేడు.

విషయం తెల్సుకొని సోమనాథం పెద్దమ్మాయి కమల భర్తను తీసుకొని వచ్చింది.

"మంచి సంబంధం! కానీ కట్నం అడక్కుండా కోరి మన అమ్మాయిని చేసుకుంటామని వచ్చిన వాళ్ళతో ఈ గిల్లి కజ్జాలేంటి? కుర్రాడు ఎంతో బుద్ధిమంతుడు. మంచి ఉద్యోగం చేస్తున్నాడు. అనవసరమైన తగువులతో సంబంధం వదులుకోవద్దు" అంటూ కమల తల్లిదండ్రులకు నచ్చచెప్పింది . కాని ఫలితం లేకపోయింది.

గౌరీనాథం, సోమనాథం ఉంటున్న వీధిలో మొదటి ఇల్లు రిటైర్డ్ తహసీలుదారు జానకిరామయ్యగారిది. ఇంటి ముందు వెనుక విశాలమైన ఆవరణ. అందులో రకరకాల పూలమొక్కలు, అరటి, జామి, సపోటా లాంటి పళ్ళచెట్లతో ఎంతో అందంగా వుంటుంది. జానకిరామయ్యగారికి పిల్లలు లేరు. జానకమ్మగారికి మొక్కలు పెంచడం హాబీ, ఊర్లో ఆ దంపతులకు మంచి గౌరవముంది. ఎంతో పలుకుబడి వుంది.

శారద తరచు జానమ్మగారింటికి పువ్వుల కోసం వెళ్తుండేది. జానకమ్మగారికి శారదంటే అభిమానం. ఈ మధ్య వారు నెల రోజులపాటు తీర్థయాత్రలకు వెళ్ళి ఆ రోజు ఉదయమే వచ్చేరు. ఆ రోజు సాయంత్రం శారద జానకమ్మగారింటికి వెళ్ళింది.

"ఏం శరదా! అంతా బావున్నారా? పరీక్షలు ఎలా రాసేవు?" అంటూ ఆప్యాయంగా పలకరించేరు జానకమ్మగారు.

"అందరం బాగున్నాం, పరీక్షలు బాగా రాసేను. క్లాసు వస్తుందండీ!" అంది శారద.

"మరి పెళ్ళెప్పుడు? ముహూర్తం నిశ్చయించేరా?" అని నవ్వుతూ అడిగేసరికి శారద ముఖం చిన్నబోయింది.

జానకమ్మగారికి విషయం ఇంకా తెలియదు.

శారదకు ఎంతలా ఆపుకున్నా దుఃఖం ఆగలేదు. జానకమ్మగారు కొద్దిగా కంగారు పడ్డారు. శారదను వూరడించి విషయం తెల్సుకుని బాధపడ్డారు.

"నువ్వేందిగులు పడకు శారదా, పెద్దవాళ్ళు అన్నీ సరిచేస్తారు" అంటూ ధైర్యం చెప్పేరు.

జానకిరామయ్యగారు భార్య ద్వారా విషయం తెల్సుకొని బాధపడ్డారు. మర్నాడుదయం సోమనాథానికీ, గౌరీనాథానికి కబురుపంపుదామనుకునేసరికి వినోద్ వచ్చేడు "నమస్కారమండి' ' అంటూ.

జానకి రామయ్యగారికి జరిగిందంతా విపులంగా చెప్పేడు.

"పెద్దవాళ్ళు ఎంతో మొండి పట్టుదలతో వున్నారు. వాళ్లు ఎవరు చెప్పినా వినే పరిస్థితిలో లేరు. అనవసరంగా మీ మాట పోవడం నాకు ఇష్టం లేదు. శారద నేను రిజిస్టర్ పెళ్ళి చేసుకుందామని నిశ్చయించుకున్నాం. రిజిస్టర్ పెళ్ళికి కావాల్సిన ఏర్పాట్లు చేయడానికే బయల్దేరేను. విషయం మీకు చెప్పి వెళ్ళమని శారద చెప్తే వచ్చేను" అన్నాడు.

"మీరు అలా చేస్తే ఏం జరుగుతుందో తెలుసా?"

"మమ్మిల్ని మరి ఇంట్లోకి రానివ్వరు. మేం అందుకు సిద్దపడే ఈ నిర్ణయం తీసుకున్నాం. నాకు వచ్చే పన్నెండు వందలతో మేమిద్దరం బ్రతగ్గలం. నా దగ్గర నాలుగువేలుంది. దాంతో మాకు అవసరమైన సామాన్లు సమకూర్చుకొని చిన్న యిల్లు అద్దెకు తీసుకొని వుంటాం" అన్నాడు ధైర్యంగా.

వినోద్ నిర్ణయాన్ని కాదనలేకపోయేరు.

"చూడు వినోద్ మీరు తొందరపడకండి. నేను దగ్గరుండి మీ పెళ్ళి జరిపిస్తాను. అంతే కాదు మీరు మా ఇంట్లోనే వుందురుగాని. మీకు మూడు గదులు అద్దెలేకుండా ఇస్తాను. నిశ్చింతగా వుందురుగాని" అని ధైర్యం చెప్పేరు.

జానకిరామయ్యగారు అన్నట్లు గానే మరో పదిహేను దినాల్లో శారద, వినోద్‌లకు రిజిస్టర్ పెళ్లి జరిపించి, వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో శాస్త్రోక్తంగా మంగళ సూత్రధారణ కూడా చేయించేరు. వినోద్ కోలిగ్స్, స్నేహితులు వచ్చి వారిని అభినందించేరు.

ఆ సాయంత్రం జానకి రామయ్య గారు అతని భార్య తమ వీధిలో వున్న వారిని పార్టీకి పిల్చేరు. జానకమ్మగారు తరచు నోములు, పూజలు, వ్రతాలు చేసి వీధిలోవారిని పిల్చి భోజనాలు పెట్టడం, పార్టీలివ్వడం రివాజు, పార్టీకి గౌరీనాథం, భార్య, సోమనాథం, భార్య కూడా వచ్చేవారు.

పార్టీ ఎందుకొరకు ఇస్తున్నారో తెలియక వచ్చినవారు తికమక పడుతున్న సమయంలో-

"మీ అందరికీ ఓ మంచి శుభవార్త! వినోద్-శారదలు అదే మన గౌరీనాథంగారి అబ్బాయి, సోమనాథంగారి రెండో అమ్మాయి ఒకర్నొకరు ఇష్టపడి పెళ్ళి చేసుకున్నారు. వారిని ఆశీర్వదించండి" అంటూ వధూవరులను రప్పించి అక్షింతలు అందరికీ ఇచ్చేరు

జానకిరామయ్యగారు.

గౌరీనాథం, సోమనాథం వస్తున్న కోపాన్ని అణచుకొని ముభావంగా అక్షింతలు జల్లి వెళ్ళిపోయేరు. వారి ప్రవర్తనకు పార్టీకి వచ్చిన వారంతా ఎంతో నొచ్చుకున్నారు. జానకిరామయ్యగారు మాత్రం చిరునవ్వు నవ్వి వూరుకున్నారు.

రెండు నెలల తరువాత ఓ రోజు సాయంత్రం జానకిరామయ్యగారు ఇంటిముందు గార్డెన్‌లో కూర్చుని పేపరు చదువుతున్నారు. జానకమ్మగారు, శారద దేవాలయానికి వెళ్ళేరు. వినోద్ ఇంకా ఆఫీసు నుంచి రాలేదు.

"నమస్కారం సార్!" అంటూ గౌరీనాథం, సోమనాథం వచ్చేరు.

జానకిరామయ్యగారు వాళ్ళిద్దరూ అలా కలసి రావడం చూసి ఆశ్చర్యపోయేరు.

"కూర్చోండి" అంటూ కుర్చీలు చూపించేరు.

"మీరిద్దరూ..." అంటూ ఏదో అడగబోయేరు.

"మీరు పెద్దలు, మా శ్రేయోభిలాషులు మా పిల్లలకు తమ ఇంట ఆశ్రయం కల్పించిన మహానుభావులు. తమ వద్ద ఇంకా దాపరికముంచడం భావ్యం కాదు. గత్యంతరం లేక మేమిద్దరం కలసి చిన్న నాటకము ఆడాల్సి వచ్చింది.

సోమనాథం నేను ప్రాణస్నేహితులం. ఇతను కాస్త నెమ్మదస్తుడు. ఇతనికి బంధువర్గం ఎక్కువ. పెద్ద కూతురు పెళ్ళి చేసి ఆర్థికంగా దెబ్బతిన్నాడు. ప్రస్తుతం అతను వుంటున్న చిన్నయిల్లు నెలకు వచ్చే పెన్షన్ తొమ్మిది వందల రూపాయలు, అడపాదడపా పిల్లలకు ట్యూషన్స్‌తో వచ్చిన దానితో గుట్టుగా సంసారం నెట్టుకువస్తున్నాడు.

మా స్నేహం బంధుత్వంగా మార్చాలని ఇతని రెండో అమ్మాయి శారదను మా అబ్బాయి వినోద్‌కు చేసుకుందామనుకున్నాం. పిల్లలు కూడా ఒకర్ని ఒకరు ఇష్టపడ్డారు. దాంతో ఇటు నా భార్య అటు అతని బంధువులు తొందరగా ఆ మూడు ముళ్ళూ వేయించమని వత్తిడి చేస్తున్నారు. ఈ రోజుల్లో ఆడపిల్లకు పెళ్ళి చెయ్యాలంటే తమకు తెలియంది కాదు. కట్నకానుకలు ఇచ్చి పుచ్చుకోడాలూ లేకున్నా భోజనాలకు, బట్టలకు, ఇతర చిల్లర ఖర్చులకు కనీసం ఇరవై వేలైనా ఉండాలి. ఎందులో లోపం జరిగినా బంధువులు రాబందుల్లా పీక్కుతింటారు.

ఎంత ప్రయత్నించినా అప్పుపుట్టలేదు. అప్పు పుట్టినా అది తీర్చగల స్తోమత లేక చివరకు తాను వుంటున్న ఆ చిన్న ఇంటికి బేరం పెట్టి ఆ విషయం నాతో చెప్పేడు. ఈ అనవసరఖర్చులు తప్పించి ఇతనిని ఈ ఊబిలోంచి బయటకు లాగడమేగాక ఇతని ఇంటిని

నిలబెట్టడం స్నేహ ధర్మంగా భావించేను అందుకోసం చిన్న నాటకం ఆడమన్నాను. దానికి ఇతను మొదట అంగీకరించలేదు. నేను ఎంతో నచ్చచెప్పి ఒప్పించేను.

మా నాటకానికి "ఆసరా"గా ఇతని మునగచెట్టు కన్పించింది. మా నాటకం రక్తికట్టింది. మా అబ్బాయి వినోద్ మొండి పట్టుదల నాకు తెలుసు కనుక అనుకున్న విధంగా మా ప్లాన్ సక్సెస్ అయింది.

వీటన్నిటికీ మించి తమరు మా పిల్లలకు ఎంతో "ఆసరా"గా నిల్చి వాళ్ళ పెళ్లి జరిపించటమేగాక తమ ఇంట్లో ఆశ్రయమిచ్చేరు. మా స్నేహితుని ఇల్లు నిలబడింది.

ఈ రహస్యం నేటివరకూ మా ఇద్దరి మధ్యా వుంది. మా శ్రేయోభిలాషులు కనుక మీకు చెప్పడం ధర్మం. తమరు కూడా దీనిని రహస్యంగానే వుంచి మా ఇద్దరికీ రాజీ కుదర్చినట్టు మీరు చిన్న నాటక మాడి మాకొడుకూ కోడల్ని మా ఇంటికి పంపించమని మా కోరిక" అన్న గౌరీనాథం మాటలకు నిర్ఘాంతపోయేరు జానకిరామయ్యగారు.

(జాగృతి, 21-9-1998) ✪